పేట్రేగిపోతున్న ఇసుకాసురులు





కోటవురట్ల: అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓ టీడీపీ నేత బరి తెగించాడు. వరాహ నదిలో దర్జాగా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నాడు. రాత్రయితే చాలు తన అనుచరులతో వచ్చి వాలిపోతున్నాడు. పొక్లెయిన్‌తో కైలాసపట్నం పరిధిలో నదీ గర్భాన్ని తవ్వేసి గ్రామ శివారున పలు ప్రాంతాల్లో నిలువ చేస్తున్నాడు. ఆపై లారీలలో తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. నిన్నటి వరకు గొట్టివాడ, పందూరు ప్రాంతాల్లోని నదిలో ఇసుక రేణువు లేకుండా చేసి, ఇప్పుడు కైలాసపట్నంపై పడ్డారు.


కైలాసపట్నం శివారున పలు ప్రాంతాల్లో నిలువ చేసిన ఇసుక గుట్టలు

కూటమి అండదండలతోనే..

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో అక్రమార్కులకు కొండంత అండ దొరికింది. టీడీపీ నాయకులు సహజ వనరులను దోచేసి సొమ్ముచేసుకునే పనిలో పడ్డారు. ప్రధానంగా వరాహనది నుంచి ఇసుక, కొండలను పిండిచేసి గ్రావెల్, రాయిని తరలించి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇదంతా హోంమంత్రి అనిత ఇలాకాలోనే జరగడం పలు విమర్శలకు తావిస్తోంది. పెద్దల అండదండలతోనే అక్రమార్కులు తమ పనిని దర్జాగా నిస్సంకోచంగా చేసుకుపోతున్నారు. దాంతో అధికారులు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో గొట్టివాడ రెవెన్యూ పరిధిలో ఓ టీడీపీ నేత వరాహనదిలో భారీ తవ్వకాలు జరిపి రూ.కోటి వరకు వెనకేసుకున్నట్టు అందరికీ తెలిసిందే. పందూరు పరిధిలోనూ గ్రామాభివృద్ధి వంకతో రూ.16 లక్షలకు వేలం నిర్వహించి ఇసుక అక్రమ తవ్వకాలు జరిపారు. పెద్దలకు స్థానిక టీడీపీ నేతలకు బెడిసి కొట్టిందో ఏమో గొట్టివాడ, పందూరు పరిధిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. తాజాగా వారం రోజులుగా కైలాసపట్నం వరాహనదిలో భారీ స్థాయిలో తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఈ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నేరుగా పొక్లెయిన్‌తో రాత్రివేళల్లో తవ్వకాలు జరిపి సిమ్మన్న గరువు, పెద్దయ్య చెరువు, ఇండేన్ గ్యాస్ గొడౌన్ సమీపంలోను, గొల్లల చింత చెట్టు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు గరువు వద్ద చెరువు ప్రాంతాల్లో ఇసుకను గుట్టలుగా నిలువ చేసి లారీలలో తరలించి విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి విశాఖ, అనకాపల్లి, యలమంచిలి, రాజమండ్రి, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. రోజుకు పది లారీల ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం..

ఇసుక అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో సాగునీరు కరువయ్యే ప్రమాదం ఉందని కలవరపడుతున్నారు. నదిలో అక్రమ తవ్వకాల కారణంగా నదిలో నీటి ప్రవాహం సమయంలో ప్రవాహ దిశ మారి భూములు కోతకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలతో భూముల కోత

నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు వల్ల నది పరీవాహక ప్రాంతంలో భూములు కోతకు గురవుతున్నాయి. జిరాయితీ భూములు చాలా వరకు కోతకు గురై నదిలో కలిసిపోతున్నాయి. దీని వల్ల రైతులు చాలా నష్టపోతున్నారు. అధికారులు అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధించాలి.

– సురేష్, కైలాసపట్నం

చర్యలు తీసుకుంటాం..



నదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నదిలో ఇసుక తవ్వకాలకు ఎవ్వరికీ అనుమతి లేదు. కైలాసపట్నంలో ఇసుక తవ్వకాలపై మాకు ఫిర్యాదు రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఆ ప్రాంతాల్లో నిఘా పెడతాం.

– తిరుమలబాబు, తహసీల్దారు, కోటవురట్ల

క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో చినతీనార్లలో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం వేకువజాము నుంచే ఆలయంలో తమలపాకు పూజ, హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కంబాల అమ్మోరయ్య ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవంలో చినతీనార్ల, పెదతీనార్ల, యాతపేట, ఎదుదల పేట తదితర గ్రామాల నుంచి వందలాది మంది మత్స్యకారులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిగింది. సాయంత్రం ఆలయంలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సీతారాముల ఆలయ హుండీ లెక్కింపు

మునగపాక: మండలంలోని అరబుపాలెం సీతారామ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు మంగళవారం నిర్వహించారు. శ్రీరామ నవమి పండగ తర్వాత నుంచి ఇంతవరకు హుండీ ద్వారా భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.19,512 ఆదాయం వచ్చినట్టు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంత కుమార్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బొడ్డేడ వెంకట సతీష్, అర్చకులు నాని పంతులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. కిశోర వికాసంలో భాగంగా మంగళవారం స్థానిక గ్రామ సచివాలయ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి విమలగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, సీహెచ్‌వో దేవకాంత, సూపర్‌వైజర్ నాగేశ్వర రావు, వైద్య సిబ్బంది సంతోషి దేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


భగవద్గీత జ్ఞానంపై ఇంటింటా ప్రచారం

ఎస్.రాయవరం: త్రైత సిద్ధాంత భగవద్గీత 101 అనుబంధ గ్రంథాలపై త్రైత సిద్ధాంతం ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ వారు మంగళవారం పెదగుమ్ములూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. యుద్ధ రంగంలో మొదటి రోజున అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీత జ్ఞానోపదేశం చేశారన్నారు. స్థానికులు సోమినాయుడు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య లేకుండా చర్యలు


రైతులతో మాట్లాడుతున్న అనకాపల్లి ఆవకాలువ చైర్మన్ నాయుడు

మునగపాక: సాగునీటి కాలువల ద్వారా రైతుల పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఆవ కాలువ సంఘ చైర్మన్ ఆడారి నాయుడు తెలిపారు. మండలంలోని మూలపేట రామాలయంలో ఏషియన్ పెయింట్స్ సిబ్బంది, రైతులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్‌లో సాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఏషియన్ పెయింట్స్ సహకారం అందిస్తుందన్నారు. సాగునీటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో రైతులు నాగేశ్వరరావు, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత


ఫెయిల్ అయిన కేబుల్‌కిట్

ఎస్.రాయవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం, ఎస్. రాయవరం రూరల్, ధర్మవరం అగ్రహారం, రేగుపాలెం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల ఆర్‌డీఎస్ఎస్ కండెక్టర్లు, చెట్టుకొమ్మ, విద్యుత్ వైర్లు మరమ్మతులు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ పనులు నిమిత్తం ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, యలమంచిలి మండలం కృష్ణాపురం, లక్కవరం, పులపర్తి, నాయనమ్మపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

గొడిచర్ల ఫీడర్‌లో సరఫరాకు అంతరాయం

నక్కపల్లి: మండలంలో గొడిచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మెరక గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే గొడిచర్ల ఫీడర్‌లో బ్రేక్ డౌన్ కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. రైల్వే క్రాసింగ్ అవుట్ గోయింగ్ కేబుల్ కిట్ ఫెయిల్ అవ్వడంతో మంగళవారం గుల్లిపాడు, రమణయ్యపేట, రేబాక, కొత్తూరు, ముకుందరాజుపేట, చీడిక, దోసలపాడు, డొంకాడ కొత్తూరు, సీతానగరం, జి.కొత్తూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టామని, బుధవారం ఉదయం నాటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు


వసతిగృహంలో స్ప్రే చేస్తున్న సిబ్బంది

నక్కపల్లి: వసతి గృహాల్లో దోమల నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం గొడిచర్ల పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నక్కపల్లిలో గురుకుల పాఠశాల, కేజీబీవీ, బీసీ వసతి గృహాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మలేరియా, వైరల్ జ్వరాలు, అతిసార, టైఫాయిడ్ వంటి వ్యాధులు బారిన పడకుండా స్ప్రే చేశామని వైద్యశాఖ సిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంధ్య, కిరణ్‌ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఈ లక్ష్మణమూర్తి, ఏఎన్ఎంలు బాలాకుమారి, ఝాన్సీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన


వేమగిరిలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ఎస్.రాయవరం: కొబ్బరిలో తెల్లదోమ, కొమ్ము పురుగు వంటి చీడపీడల నివారణకు, కోతుల బెడదను నియంత్రించడానికి రైతులందరూ సంఘటితం కావాలని రాజమహేంద్రవరం వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త కె.ప్రభాకర్‌రావు తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా వేమగిరి, లింగరాజుపాలెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ కొబ్బరి, కూరగాయ పంటల్లో సమగ్ర యాజమాన్య చర్యలు వివరించారు. టమాటా వంటి పంటల్లో ఎండు తెగులు నియంత్రించడానికి అంటుమొక్కల ద్వారా సాధ్యమని చెప్పారు. అందుకు అవసరమైన ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య, అభ్యుదయ రైతులతోపాటు వేమగిరి సర్పంచ్ అబ్బాయిదొర, రైతులు రామ్మూర్తిరాజు, నారాయణమూర్తి, అనిల్, కుమార్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వెద సాగుకు విత్తన ఎంపిక కీలకం

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు


శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: రానున్న వర్షాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, వెద సాగుకు అనుకూలమైన ఎంటీయూ 1262, 1318, 1224 వంటి వరి రకాలను ఎంపిక చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో ఆయన మాట్లాడారు. వరి కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజింతో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. కలుపు సమస్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున విత్తిన రెండు రోజుల్లోపు పెండిమిథాలిన్ 700 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి నారుమళ్లు వేసుకోవడానికి నేలను దున్ని తయారు చేసుకుని విత్తనం సేకరించుకోవాలన్నారు. సజ్జ, కొర్ర వేసే రైతులు అనుకూలమైన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులకు, చెరకు పైరులో మొవ్వ కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్బెండిజిమ్ ఒక గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. చెరకులో పేనుబంక ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. వర్షాలను వినియోగించుకుని కూరగాయ, తీగ జాతి కూరగాయ పంటలను వేసుకోవాలని సూచించారు. అరటిలో సిగటోక తెగులు ఆశించి, అధిక వర్షాలకు వ్యాపించే అవకాశం ఉందన్నారు., నివారణకు ప్రోపికొనజోల్ 0.1శాతం లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. భూమిలో అధిక తేమ వల్ల అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి దుంప చుట్టూ తడిచే విధంగా పోయాలన్నారు.

అప్పన్నకు నిత్య కల్యాణం


స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది జీతాల నిర్వహణపై ఎస్‌బీఐతో ఒప్పందం

ఉక్కునగరం: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది జీతాల ఖాతాలను నిర్వహించేందుకు సీఐఎస్ఎఫ్‌తో ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఖాతాలను మూడేళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం జరిగింది. ఈ మేరకు సీఐఎస్ఎఫ్ తరపున అడ్మినిస్ట్రేషన్ డీఐజీ రేఖ నంబియార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ జీఎం రంజన్ సిన్హాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం సిబ్బందికి మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను సమకూర్చడంతో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు దోహదపడతాయని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ వర్గాలు తెలిపారు. జీరో అక్కౌంట్ ఇవ్వడంతో పాటు రూ. 50 లక్షలు ప్రమాద బీమా (మరణ) కవరేజి ఉంటుంది. వార్షిక నిర్వహణ చార్జీలు లేకుండా ఉచిత డెబిట్ కార్డు, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు, ఇతర బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు, హర్షక లాకర్‌పై 10 శాతం రాయితీ ఉంటాయి. ఉచిత డిమాండ్ డ్రాఫ్ట్‌ల జారీ ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా జవాన్లకు ఎస్‌బీఐ రిష్తే కుటుంబ పొదుపు ఖాతాను పరిచయం చేశారు.

జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా కె. చక్రవర్తి నియమితులయ్యారు. విశాఖపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడిగా విధులు నిర్వహిస్తున్న ఈయనను డిప్యూటేషన్‌పై జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఈదురుగాలులతో వర్షం


సత్యవరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్న దృశ్యం

మాడుగుల : మండలంలో సత్యవరం, తాటిపర్తి, అవురువాడ గ్రామాల్లో మంగళవారం సాయంకాలం ఈదురుగాలులో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. గత 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు, గాలులకు సుమారు 300 ఎకరాల్లో అపరాలు సాగు దెబ్బతిన్నాయి. ఒక వైపు ఖరీఫ్ సీజన్ రావడంతో వరి నారు మడులు సిద్ధం చేసుకోలేకపోతున్నామని, పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోలేక పోతున్నామని, పలు గ్రామాలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

మాడుగుల రూరల్: మృగశిర కార్తె ప్రవేశంతో మంగళవారం ఉదయం నుంచి ఆడపా దడపా వర్షం కురుస్తుంది. దీంతో వాతావరణం చల్లబడింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. వరి నారు మడులు సిద్ధం చేస్తున్నారు.

మునగపాకలో వర్షం


మునగపాకలో కురుస్తున్న వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో సతమతమయ్యే ప్రజలు ఈ వర్షంతో సేద తీరారు. వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షం సాగుకు దోహదపడుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మునగపాక: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్‌తోపాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. మునగపాక గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో హోమాలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెల 31 వ తేది నుంచి జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలు బుధవారంతో ముగియనున్నట్టు ఆలయ ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నాగవల్లి సంబరాలు పురస్కరించుకుని, ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి, రాత్రి 7 గంటలు నుంచి స్వామి వారి పుష్పంజలి సేవ, దర్పణ దర్శనం, పవళింపు సేవ ఉంటుందని తెలిపారు.

ఉపమాక రోడ్డు జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్


ఉపమాక ఆర్చి జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఉపమాక రోడ్డు జంక్షన్‌లో ప్రమాదాల నివారణ కోసం పోలీసులు చర్యలు చేపట్టారు. ఇక్కడ ఆర్చి వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటి నివారణకు స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. రాజయ్యపేట, చందనాడ, నర్సాపురం, బుచ్చిరాజుపేట తదితర గ్రామాలకు చెందినవారు ఉపమాక మీదుగా నక్కపల్లి రావాల్సి ఉంటోంది. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉపమాక రోడ్డు ఆర్చి మీదుగా తీర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటోంది. హెటిరో కంపెనీకి వెళ్లే వాహనాలతోపాటు, ఆలయానికి వెళ్లే భక్తులతో ఉపమాక రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు, భారీ వాహనాల కారణంగా రద్దీగా ఉండే జంక్షన్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతతోపాటు గాయాల పాలవుతున్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం పోలీసు యంత్రాంగం బల్క్ డ్రగ్ పార్క్ వద్ద మౌలిక సదుపాయాల పనులు చేపట్టిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సహకారంతో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. ఈ జంక్షన్‌లో ఆటోవాలాలు రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల రద్దీ ఏర్పడుతోందని సీఐ కుమారస్వామి తెలిపారు. వీటన్నింటిని అరికట్టి ముందుస్తు చర్యల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నక్కపల్లి జాతీయ రహదారిలో ఆస్పత్రికి వెళ్లే రోడ్డు, నక్కపల్లికి వచ్చే మార్గంలో త్వరలో డంబుల్ స్ట్రిప్స్ (40 మీటర్ల) దూరం కలిగినవి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

చురుగ్గా కాలువ అభివృద్ధి పనులు


కృష్ణంరాజు కాలువలో అభివృద్ధి పనులు

మునగపాక: స్థానిక కృష్ణంరాజు కాలువలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. 15 సంవత్సరాలుగా కాలువలో పేరుకుపోయిన తుప్పలు, సిల్టు కారణంగా సాగునీటి ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం కాలువలో మిషన్ సహాయంతో తుప్పల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఈ కాలువపై ఆధారపడి సాగు చేపట్టే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సంబంధిత పనులను కాలువ సంఘ అధ్యక్షుడు పెంటకోట రాము, ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీరామమూర్తి, డైరెక్టర్లు పచ్చికూర నరసింగరావు, వేగి పరదేశినాయుడు, సంఘ మాజీ అధ్యక్షుడు భీమిశెట్టి గణేష్‌నాయుడు తదితరులు పరిశీలించారు. పనులు వేగవంతం చేసి పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపడతామన్నారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు

- లేగదూడలు, నాటు కోళ్లపై దాడి
- వీధి శునకాలను నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యం


వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నాతవరం : గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో ప్రజలు బయటకు రావడానికి భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల కాలంలో ఏగ్రామంలో చూసిన కుక్కలు గుంపులుగా సంచరించి మనుషులపైనే కాకుండా పశువులపై కూడా దాడులు చేస్తున్నాయి. రెండు నెలలు వ్యవధిలోనే నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల పరిధిలో కుక్క కాటుకు సంబంధించి 56 మందికి పైగా కేసులు నమోదయ్యాయి. రాత్రి వేళల్లో వీధుల్లో ఒంటరిగా తిరగడానికి ప్రజలు భయపడుతున్నారు. గతంలో అయితే పంచాయతీ అధికారులు కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టేవారు. ఇటీవల కాలంలో దీనిపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా కుక్కలు సంచారం విపరీతంగా పెరిగిపోతుంది. గునుపూడి, గుమ్మడిగొండ, మర్రిపాలెం, శృంగవరం, ఎంబీపట్నం గ్రామాల్లో పశువుల పాకల వద్ద లేగదూడలను సైతం గాయపరిచాయి. రైతులు కల్లాల వద్ద పెంచుకునే నాటు కోళ్లను తినేస్తున్నాయి. దీంతో బాధిత యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.